ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప జిల్లా వార్తలు
5
శుక్రవారం 15 నవంబరు 2024

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



మహిళా సంఘాలను ఈ-కామర్స్ బిజినెస్ వైపు ప్రోత్సహించాలి

● కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహిళా పొదుపు సంఘాలను ఈ-కామర్స్ బిజినెస్ వైపు అడుగులు వేయించి.. సంపూర్ణ సాధికారిత సాధించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్డీఏ, మెప్మా పరిధిలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ రకాల పనుల పరోగతిపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత పొదుపు సంఘాల బలోపేతంతోనే సాధ్యమన్నారు. స్వయం సహాయక సంఘాలతో పాటు వికలాంగులు, వృద్ధాప్య, చిరు వ్యాపారుల గ్రూపులను ఏర్పాటు చేసి వారి జీవన ప్రమాణాలను పెంచాలన్నారు. సామాజిక భద్రతలో భాగంగా వృద్ధా ప్య మహిళా సంఘాలను ఏర్పాటు చేసి ఆయా సంఘాల పటిష్టతకు కృషి చేయాలన్నారు. ప్రతి మండలంలో చురకుగా ఉన్నా స్వయం సహాయక గ్రూపులను గుర్తించి వారిని ఈ- కామర్స్ బిజినెస్‌లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహించాలన్నారు. అంతేకాకుండా వారికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు సరైన శిక్షణను అందివ్వాలన్నారు. జిల్లా నుంచి అత్యంత నాణ్యతా ప్రమాణాలు కలిగిన వందలాది రకాల ఉత్పత్తులను రూపొందించాలని సూచించారు. మండల స్థాయిలో కూడా ఈ- కామర్స్‌బిజినెస్‌లో భాగస్వాములు చేసి వారి అభివృద్ధికి పాటు పడాలన్నారు. జిల్లాలో అర్హత కలిగిన అన్ని స్వయం సహాయక సంఘాలకు రానున్న నాలుగు నెలల్లో లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలన్నారు. సభ్యులందరికీ పెన్షన్లు, గృహాలు, ఆరోగ్యశ్రీ అందుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకోవాలన్నారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, ఉన్నతి, వ్యవసాయ అనుబంధ, వ్యవసాయేతర ఉపాధి మార్గాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చంద్రన్నబీమా, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ, మెప్మా, డ్వామా అధికారులు ఆనంద్ నాయక్, సురేష్‌రెడ్డి, జోయల్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు నాలుగు ప్రత్యేక రైళ్లు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రికుల కోసం భారతీయ రైల్వే నాలుగు ప్రత్యేక రైళ్లను కడప మీదుగా నడుపుతున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు.

● కాచిగూడ - కొట్టాయం - కాచిగూడ (07133/07134) ప్రత్యేక రైలు ఈ నెల 14, 21, 28 (ప్రతి మంగళవారం) తేదీల్లో నడుస్తుందన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో ఈనెల 15, 22, 29 (శుక్రవారం) తేదీల్లో కొనసాగుతుందన్నారు.

● హైదరాబాదు-కొట్టాయం-హైదరాబాదు (07135/07136) ప్రత్యేక రైలు ఈ నెల 19, 26 (మంగళవారం) తేదీల్లో కొనసాగుతుందని.. తిరుగు ప్రయాణంలో ఈ నెల 20, 27 (బుధవారం) తేదీల్లో నడుస్తుందన్నారు.

● నాందేడ్ - కొల్లం - సికింద్రాబాద్ (07139/07140) రైలు ఈ నెల 16న (శనివారం) .. తిరుగు ప్రయాణంలో 18న సోమవారం నడుస్తుందన్నారు.

● మౌళాలి-కొల్లం-మౌళాలి (07141/07142) ప్రత్యేక రైలు ఈనెల 23, 30 (శనివారం) తేదీల్లో నడుస్తుందని.. తిరుగు ప్రయాణంలో ఈనెల 25, డిసెంబరు 2న (సోమవారం తేదీల్లో కడప మీదుగా ప్రయాణం చేస్తుందన్నారు. అయ్యప్ప భక్తులు ఈ రైళ్లను తమ ప్రయాణానికి అనుకూలంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంజన్నను దర్శించుకున్న జబర్దస్త్ టీం

చక్రాయపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామిని గురువారం కామెడీ షో జబర్దస్త్ టీం దర్శించుకున్నారు. అంజన్నను దర్శించుకున్న వారిలో రైజింగ్ రాజు, హరిత మరికొందరు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు కేసరి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్ర, అంజన్న మహిమలను పూజారులను అడిగి తెలుసుకున్నారు. జబర్దస్త్ టీం గండికి విచ్చేసిందని తెలియగానే జనాలు తరలివచ్చారు. వారితో సెల్ఫీలు దిగి సంతోషం వ్యక్తం చేశారు.



అంజన్న హారతులు అందుకుంటున్న జబర్దస్త్ టీం

పల్లెలకు ప్రగతి దారులు





గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన కడప నగరం నుంచి చలమారెడ్డి పల్లెకు వెళ్లే రహదారి



కమలాపురం నియోజక వర్గంలో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి (ఫైల్)

● రూ.75.80 కోట్లతో 998 పనులకు శ్రీకారం
● 171.17 కిలోమీటర్ల రహదారులకు మహర్దశ
● 2825.43 మీటర్ల కాంపౌండ్ వాల్ నిర్మాణాలు
● చకచకా సాగుతున్న పనులు
● మారనున్న గ్రామాల రూపులేఖలు
● తీరనున్న పల్లెవాసుల కష్టాలు

కడప రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేసింది. గ్రామ పంచాయతీలకు పైసా విదల్చక పోగా కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం పక్కదారి పట్టించడంతో పల్లెల ప్రగతి మరుగున పడింది. చాలా గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో పల్లె రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మురుగు కాలువలు కొద్దిపాటి వర్షాలకే పొంగిపొర్లి వీధుల్లో చేరి అపరిశుభ్రత తాండవిస్తోంది. ఈనేపథ్యంలో చాలా గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు తమ సొంత నిధులు ఖర్చు చేసి పనులు చేపట్టారు. చేసిన పనులకు బిల్లులు రాక అప్పుల పాలయ్యారు. ఈ నేపధ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాలకు మంచి రోజులు వచ్చాయి. ఏళ్ల తరబడి రహదారుల సౌకర్యానికి నోచుకోని పల్లెలకు రహదారులు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా ఉపాధి నిధులతో రహదారులు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ మేరకు కడప జిల్లాలో రూ.75.80 కోట్లతో పల్లెలకు ప్రగతి దారులను ఏర్పాటు చేస్తోంది. ఇందుకు అవసరమైన 998 పనులు చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీకారం చుట్టారు. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాలలో 171.17 కిలోమీటర్ల రహదారులకు మహర్దశ కలగనుంది.

నియోజకవర్గాల వారీగా పనులు

● మైదుకూరు నియోజకవర్గంలో రూ.1235.28 లక్షలతో 32,669.50 మీటర్ల మేరకు 205 పనులు చేపడుతున్నారు. ఇందులో రూ.847.65 లక్షలతో 21,190.50 మీటర్ల మేర 182 సిమెంట్ రోడ్ల పనులను, రూ.435 లక్షలతో 3480 మీటర్ల 2 తారురోడ్ల పనులను, రూ.212 లక్షలతో 8960 మీటర్లతో 8 మెటల్ రోడ్ల పనులను చేపడుతున్నారు. అలాగే రూ.55.63 లక్షలతో 779 మీటర్ల మేరకు 14 కాంపౌండ్‌వాల్ గోడలను నిర్మిస్తున్నారు.

● కమలాపురం నియోజకవర్గంలో రూ.1630 లక్షలతో 43,839 మీటర్ల మేర 282 పనులు చేపడుతున్నారు. ఇందులో రూ.1512 లక్షలతో 37,799 మీటర్లతో 268 సిమెంట్ రోడ్ల పనులను, అలాగే రూ.83 లక్షలతో 5550 మీటర్ల మేర 9 మెటల్ రోడ్ల పనులను చేపడుతున్నారు. అలాగే రూ.35లక్షలతో 490 మీటర్లతో 5 కాంపౌండ్‌వాల్ గోడలను నిర్మిస్తున్నారు.

● బద్వేల్ నియోజకవర్గంలో రూ.1406 లక్షలతో 31,670 మీటర్ల మేర 213 పనులు చేపడుతున్నారు. ఇందులో రూ.1334.50 లక్షలతో 26,665 మీటర్ల మేర 207 సిమెంట్ రోడ్ల పనులను, అలాగే రూ.71.5 లక్షలతో 5005 మీటర్లతో 6 మెటల్ రోడ్ల పనులను చేపడుతున్నారు.

● పులివెందుల నియోజకవర్గంలో రూ.525.40 లక్షలతో 11,661.43 మీటర్ల మేర 91 పనులు చేపడుతున్నారు. ఇందులో రూ.503.24 లక్షలతో 11,443 మీటర్ల మేర 87 సిమెంట్ రోడ్ల పనులను, అలాగే రూ.10లక్షలతో 130 మీటర్ల మేర 1 కాంపౌండ్‌వాల్ గోడను నిర్మిస్తున్నారు.

● ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రూ.850.04 లక్షలతో 17,869 మీటర్ల మేర 77 పనులు చేపడుతున్నారు. ఇందులో రూ.705.04 లక్షలతో 14108 మీటర్ల మేర 70 సిమెంట్ రోడ్ల పనులను, అలాగే రూ.1000 లక్షలతో 2636 మీటర్ల మేర 3 తారురోడ్ల పనులను, రూ.30లక్షలతో 750 మీటర్ల మేర 1 మెటల్ రోడ్డు పని చేపడుతున్నారు. అలాగే రూ.15 లక్షలతో 375 మీటర్ల మేర 2 కాంపౌండ్‌వాల్ గోడలను నిర్మిస్తున్నారు.

● జమ్మలమడుగు నియోజక వర్గంలో రూ.1934.35 లక్షలతో 33,467 మీటర్ల మేర 130 పనులు చేపడుతున్నారు. ఇందులో రూ.947.35 లక్షలతో 18,574 మీటర్ల మేర 101 సిమెంట్ రోడ్ల పనులను, రూ.691.50 లక్షలతో 9730 మీటర్ల మేర 7 తారు రోడ్ల పనులను, రూ.135 లక్షలతో 4200 మీటర్ల మేర 4 మెటల్ రోడ్ల పనులను చేపడుతున్నారు. అలాగే రూ.41 లక్షలతో 264 మీటర్ల మేర 5 కాంపౌండ్‌వాల్ గోడలను నిర్మిస్తున్నారు.

సంక్రాంతి పండుగ నాటికి పనులు పూర్తి

జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.75.80 కోట్లతో చేపడుతున్న 998 పనులను 2025 సంక్రాంతి పండుగ నాటికి పూర్తిచేసి మరో పల్లె పండుగకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. గత ఆగస్టు నెలలో 14 నుంచి 21 వరకు పల్లెపండుగను కూటమి ప్రభుత్వం నిర్వహించి పల్లె రహదారులకు శ్రీకారం చుట్టింది. అవసరమైన గ్రామంలో రహదారులు, కాలువలు ఇతర వసతులు కల్పించేందుకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేత శంకుస్థాపనలు చేయించి పనులకు శ్రీకారం చుట్టారు. వచ్చే సంక్రాంతి పండుగ నాటికి రహదారులను పూర్తి చేసేలా ప్రభుత్వం లక్ష్యాలు నిర్దేశించింది.

మారనున్న గ్రామాల రూపులేఖలు

ఉపాధిహామీ పథకం ద్వారా రూ.75.80కోట్లతో 171.17 కిలోమీటర్ల మేర 998పనులు పూర్తయితే ఆయా గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో చారెడు మట్టికి నోచుకోని వీధులు సిమెంట్ రోడ్లుగా, తారు రోడ్లుగా ఏర్పడి రహదారుల సౌకర్యం ఏర్పడుతుండడంతో పల్లెవాసులు తమ కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు.

వైసీపీ సోషల్ మీడియాలో అలజడి

● బూతు కంటెంట్ ఇచ్చిన వారిపై పోలీసుల నిఘా ● వర్రా రవీంద్రారెడ్డి ఎంక్వయిరీతో పలువురికి నోటీసులు

(కడప-ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో 2019-24 సంవత్సరంలో వైసీపీ అండ్ కో రెచ్చిపోయింది. సోషల్ మీడియాలో ప్రశ్నించే వారిపై జుగుప్సాకరమైన పోస్టులు పెడుతూ వచ్చింది. అయితే ఎప్పటికైనా పాపం పండుతుందన్నట్లుగా వైసీపీ సోషల్ మీడియాలో పసువుగా పేరొందిన వర్రా రవీంద్రారెడ్డిపై సింహాద్రిపురానికి చెందిన హరి ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. వర్రా రవీంద్రారెడ్డి సోషల్ మీడియాలో జుగుప్సాకరమైన పోస్టులు పెట్టేవారు. ఆ పోస్టులను జిల్లాలో గ్రామస్థాయి నుంచి పైస్థాయి వరకు 40 మంది సేవ్ చేసినట్లు గుర్తించారు. వీరందరికీ పార్ట్1 ఏ నోటీసు ఇవ్వనున్నారు. ఇప్పటికే కొందరికి నోటీసులు ఇచ్చారు.

2019-24 సంవత్సర కాలంలో పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలో జిల్లా వాసులకు జరిగిన మేలు కన్నా కీడే ఎక్కువ జరిగిందంటారు. వైసీపీ సోషల్ మీడియా కీలక వ్యక్తి వర్రా రవీంద్రారెడ్డి, మాజీ సీఎం వైఎస్‌జగన్ సతీమణి భారతి పీఏగా పనిచేశారంటారు. అయితే వర్రా రవీంద్రా రెడ్డితో పాటు పలువురిపై పోలీసు కేసులు నమోదయ్యాయి. వర్రా వాంగ్మూలం మేరకు ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డి కొడుకు భార్గవరెడ్డి, జగన్ సమీప బంధువు, మేనల్లుడు అయిన అర్జున్‌రెడ్డిపై వీఎస్ యాక్ట్ మేరకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. ఇప్పటికే వర్రా రవీంద్రారెడ్డిపై అన్నమయ్య జిల్లాలో నమోదైన కేసును పులివెందులకు ట్రాన్స్‌ఫర్ చేశారు. అలాగే జిల్లాలోని కడప, రాజంపేట, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు ప్రాంతాల్లో పదికి పైగా కేసులు, రాష్ట్రవ్యాప్తంగా 40కేసులు నమోదైనట్లు చెబుతారు. ఇక వర్రా వాంగ్మూలం మేరకు 45 మంది వైసీపీ కార్యకర్తల కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. వారంతా పైస్థాయి ఆదేశాల మేరకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నట్లు చెప్పుకొచ్చారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ఇతర వాటి ల్లో వర్రా రవీంద్రరెడ్డి కంటెంట్‌ను పోస్టులు చేస్తున్నట్లు గుర్తించారు. గతంలో వైసీపీ సోషల్‌మీడియా రాష్ట్ర కోఆర్డినేటరుగా పనిచేసిన గుర్రంపాటి దేవేంద్రరెడ్డి అండ్‌కో బ్యాచ్ అసభ్యకర పోస్టుల షేరింగ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 2019 నుంచి వైసీపీ సోషల్ మీడియా బాధితులను ఐడ్రీమ్ యూట్యూబ్ చానెల్ అధినేత చిన్న వాసుదేవరెడ్డి ఏపీ డిజిటల్ మీడియా కార్పొరేషన్ బాధ్యతలు చేపట్టారు. ఇతని హయాంలో మీడియా మొత్తం కొలాప్స్ అయిందంటారు. వైసీపీకి చెందిన 12మంది కార్యకర్తలను పార్టీలో కొందరు కీరోల్ అభ్యర్థులుగా ఎంపిక చేశారు.

భూకాలకేయులు

● బి.కోడూరు ప్రభుత్వ భూములపై వైసీపీ మార్కు కబ్జా
● మూడురోజులుగా ఎక్స్‌కవేటర్లతో భూమి చదును
● తెల్లారేసరికి భూముల సరిహద్దులు ఏర్పాటు

(కడప - ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాం భూకబ్జాలమయం. అప్పుడు అధికారం మాటు న భూములను ఆక్రమించే వాళ్లదే రాజ్యం. అది ప్రభుత్వ భూమి అయినా ప్రైవేటు భూమి అయినా సరే. దొరికితే చాలు. ఆక్రమించేసి అమ్మేసుకోవడం సంపాదించుకోవడం వారి నైజం. బి.కోడూరులో లక్షలాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను వైసీపీ అండ్ కో బ్యాచ్ ఆక్రమించేసుకుని ఇప్పుడు చదను చేయడమే హాట్‌టాపిక్‌గా మారింది.

బి.కోడూరు మండలంలోని మేకవారిపల్లె రెవెన్యూ పొలం సర్వేనెం. 575లో 449.20 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. మూలవారిపల్లె, పెదుళ్లపల్లె గ్రామాల పరిధిలో ఈ ల్యాండ్ ఉంది. అయితే ఈ భూమి చాలా సారవంతమైనది. విలువైనది. ఈ భూములన్నీ వైసీపీ నేతల చేతల్లో ఉన్నాయి. వైసీపీ నేతలు గత మూడురోజుల నుంచి రాత్రిరాత్రికి ఎక్సకవేటర్లు పెట్టి భూముల్లో చెట్లు పెరికి చదను చేసి కంచెలు వేసి ఆక్రమించేస్తున్నారు. తెల్లారేసరికి భూములుకు సరిహద్దులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికార యంత్రాంగం హెచ్చరిస్తున్నప్పటికీ ఇక్కడ మాత్రం విలువైన వాటిని కాజేస్తుండడం గమనార్హం. ఈ విషయమై బి.కోడూరు తహసీల్దారు మధునాయక్‌ను వివరణ కోరగా, చదను చేస్తున్న ప్రభుత్వ భూములు పరిశీలించామని, అవన్నీ ప్రభుత్వ భూములేనని, ఇక్కడ ఎవరైనా అడుగు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



భూములు చదును చేసిన దృశ్యం

ల్యాప్‌టాప్‌ల కొనుగోల్‌మాల్

● ట్రిపుల్‌ఐటీల్లో నాణ్యతకు తిలోదకాలు
● 2023లో 6500 ల్యాప్‌టాప్‌ల కొనుగోలు
● కొనుగోలులో అవినీతి జరిగిందని మండలిలో చర్చ
● ల్యాప్‌టాప్‌లు లేకుండానే విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

వేంపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక యూనివర్సిటీ (ఆర్జీయూకేటీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో విద్యార్థులకు అందించే ల్యాప్‌టాప్‌లలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. కొనుగోలు చేసిన వెంటనే అవి పనిచేయకుండా పోతున్నాయి. ఇప్పటికే మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించలేని దుస్థితిలో ట్రిపుల్‌ఐటీలు ఉన్నాయి. 2023లో సుమారు రూ.18 కోట్లు వెచ్చించి 6500 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారు. ఇందులో సుమారు రూ.5 కోట్ల మేర అవినీతి జరిగిందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. టెండర్ ప్రక్రియ అంతా సక్రమంగా జరిగినట్లు చూపుతున్నప్పటికీ బయట మార్కెట్‌లో రూ.19 వేలకు మించి ధర పలకని ల్యాప్‌టాప్‌లకు రూ.27 వేలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఇందులో కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయంపై శాసన మండలిలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ల్యాప్‌టాప్‌ల్లో అవినీతి జరిగిందని సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేయగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ల్యాప్‌టాప్‌ల కొనుగోలులో అవినీతి జరిగిందని అంగీకరిస్తూనే 90 రోజుల్లో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీలు ఉండగా ఒక్కో దానిలో 6 వేల మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 24 వేల మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు. ట్రిపుల్‌ఐటీలో చేరిన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో విద్యాబోధన చేపట్టాలనే వినూత్న బోధనతోనే నెలకొల్పారు. చేరిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ప్రభుత్వమే ఇస్తుంది. 2008లో ప్రారంభమైన ట్రిపుల్‌ఐటీలలో సకాలంలో ల్యాప్‌టాప్‌లు అందించారు. కానీ సంవత్సరాలు గడిచేకొద్దీ మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు వెంటనే ల్యాప్‌టాప్‌లు ఇచ్చే పరిస్థితి లేకుండాపోయింది. నిధుల కొరతగాని, అధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యం గాని మరే ఇతర కారణాలతో ట్రిపుల్‌ఐటీలు నెలకొల్పి ల్యాప్‌టాప్‌లతోనే విద్య అన్న లక్ష్యం నీరుగారుతూ వస్తోంది. కొన్నిసార్లు మొదటి రెండు సంవత్సరాలు కూడా ల్యాప్‌టాప్ లేకుండానే పీయూసీ పూర్తి చేసిన విద్యార్థులు గతంలో ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టులో 4400 మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీల్లో చేరారు. ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో చాలా మంది విద్యార్థులకు ఇప్పటికీ ల్యాప్‌టాప్‌లు అందలేదు. నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీల్లో కొందరికి కొత్తవి అందించగా మరికొందరికి పాతవాటినే మళ్లీ మరమ్మతులు చేయించి అందించారు. ఇది ప్రస్తుతం ట్రిపుల్‌ఐటీల్లో ల్యాప్‌టాప్ విద్యపరిస్థితి. నాణ్యమైన ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంటోందని విద్యార్థులు వాపోతున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

ఆర్జీయూకేటీలోని నాలుగు ట్రిపుల్‌ఐటీలకుగాను గత ఏడాది 600 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఆ మేరకు టెండర్ ప్రక్రియ నిర్వహించినట్లు తెలిసింది. ఒక్కో ల్యాప్‌టాప్‌నకు రూ.27 వేలకు పైగా వెచ్చించినట్లు తెలుస్తోంది. అయితే బయటి మార్కెట్‌లో రూ.19 వేలకు మించి ధర పలకదనే ఆరోపణలు ఉన్నాయి. టెండర్ ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు పైకి కనిపించేలా ప్రక్రియ సాగిస్తారు. కానీ అందులో సుమారు రూ.5 కోట్ల కమీషన్ల రూపంలో అవినీతి జరిగినట్లు టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇందుకు గాను ల్యాప్‌టాపుల్లో నాణ్యతలేని పరికరాలు అమర్చి అందించినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే సుమారు 1500కు పైగా ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేసన వెంటనే మరమ్మతులకు వచ్చినట్లు చెబుతున్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ సాగిస్తే అసలు విషయం వెల్లడవుతుంది.

సమగ్ర విచారణ జరపాలి: ఎమ్మెల్సీ

ఆర్జీయూకేటీ పరిధిలో ఉన్న ట్రిపుల్‌ఐటీల్లో ల్యాప్‌టాపుల్లో భారీ అవినీతి జరిగిందని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలి సమావేశంలో ట్రిపుల్‌ఐటీలలో నెలకొన్న సమస్యలపై ప్రస్తావిస్తూ గత ఏడాది 6500 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారని, నాణ్యత లేకుండా కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లకు అధిక ధరను వెచ్చించారని తెలిపారు. బయటి మార్కెట్‌లో రూ.19 వేలకు మించని వాటికి రూ.28 వేలకు పైగా వెచ్చించడం చూస్తుంటే ఇందులో కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందన్నారు. ల్యాప్‌టాప్‌లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, దీనిపై సంవత్సరాలు తరబడి విచారణ కాకుండా నిర్దిష్ట గడువులోగా సమగ్ర విచారణ జరపాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ అడిగారు.



90రోజుల్లోగా విచారణ పూర్తి చేస్తాం

ట్రిపుల్‌ఐటీలకు కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌ల్లో అవినీతి జరిగిందని అంగీకరించిన విద్య, ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్ 90 రోజుల్లో విచారణ పూర్తిచేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని శాసనమండలిలో తెలిపారు. ఎమ్మెల్సీ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌ల్లో 1500 వరకు రిపేర్లు ఉన్నాయని, సౌండ్ సరిగ్గా లేదని, అసలు సిస్టం సరిగ్గా లేదని ఇలా రకరకాల సాంకేతిక సమస్యలు ల్యాప్‌టాప్‌ల్లో ఉన్నాయన్న విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తుది దశకు.. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



కడప స్పోర్ట్స్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో గత 5 రోజులుగా నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ గురువారం తుది దశకు చేరుకుంది. గత రెండు రోజులుగా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షానికి డీఎస్ఏ మైదానం చిత్తడి నెలకొన్న దృష్ట్యా అభ్యర్థుల పరుగు పందెంకు అంతరాయంగా మారింది. దీంతో రన్నింగ్‌ను స్టేడియంలో కాకుండా మహావీర్ సర్కిల్ నుంచి రిమ్స్‌కు వెళ్లే మార్గం వైపు నిర్వహించారు. ఇందుకు అనుగుణంగా అభ్యర్థులను మైదానం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా మహావీర్ సర్కిల్ వద్దకు చేర్చారు. ఇదిలా వుండగా అభ్యర్థులకు లాంగ్‌జంప్, హైజంప్, కంటిచూపు, డిప్స్, చినప్స్, తదితర ఈవెంట్స్‌ను డీఎస్ఏ మైదానంలో సంబంధిత ఆర్మీ అధికారులు నిర్వహించారు. కాగా గురువారం నాటి ఈవెంట్స్‌కు కొద్ది మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. చివరి రోజు శుక్రవారం హాజరయ్యే అభ్యర్థులకు అదేరోజు పరీక్షలతో పాటు ఎంపికైన వారికి వైద్య పరీక్షలు చేయనున్నారు.

కేసీ కెనాల్ ఆక్రమణలపై చర్యలు వేగవంతం

● రాయచోటి ఆర్డీవో, మరో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు నోటీసులు
● నలుగురు మున్సిపల్ కమిషనర్లు
● ఐదుగురు టౌన్ ప్లానింగ్ అధికారులు
● మరో ఎంపీడీవోకూ నోటీసులు

6

భవన నిర్మాణ కూలీలకు వరం సంక్షేమ చట్టం

● అవగాహన లేమితో దూరంగా కార్మికులు
● సద్వినియోగం చేసుకోవాలంటున్న కార్మిక శాఖ

6



భవన నిర్మాణ కూలీలకు వరం

సంక్షేమ చట్టం

- ఈ చట్టంతో కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు
- అవగాహన లేమితో దూరంగా కార్మికులు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న కార్మిక శాఖ

పీలేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మిక రంగంలో భవన నిర్మాణ రంగానిదే అగ్ర తాంబూలం. ఉన్న చోటనే లేక సమీప ప్రాంతంలోనే భుక్తి మార్గం కల్పించడంలో భవన నిర్మాణ రంగానిది ప్రత్యేకత. అందుకనే చాలామంది రైతులు, రైతు కూలీలు, సాధారణ కూలీలు తమ సంప్రదాయ వృత్తులను వదిలి భవన నిర్మాణ రంగంలోకి వెళుతుంటారు. నైపుణ్యం, అనుభవం, నేర్పరితనాన్ని బట్టి నిర్మాణ రంగంలో వేతనాలు ఉంటుంటాయి. శారీరకంగా ధృడంగా ఉన్నన్నాళ్లు ఎటువంటి రిటైర్మెంట్ లేకుండా పనిచేసుకునే అనువైనది నిర్మాణం రంగం. అయితే నిత్యం ప్రమాదపు అంచుల్లో పనిచేసే ఆ రంగంలోని తాపీమేస్త్రీలు, కూలీలకు రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే ఉంటుంటాయి. నిత్యం ఎక్కడో ఒకచోట భవన నిర్మాణ రంగ కూలీలు మృత్యువాతపడుతూనే ఉంటారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా మేస్త్రీలు, గృహ యజమానులు అందించే కాసింత పరిహారంతోనే ప్రమాదానికి గురైన వారు సరిపుచ్చుకుంటూ ఉంటారు. ఇక ప్రమాదాల కారణంగా అంగవైకల్యం పొందిన వారైతే చేసేది లేక ఇంటి పట్టునే ఉంటూ నిరాశతో జీవితం గడుపుతూ ఉంటారు. నిర్మాణ రంగంలోని ఇటువంటి ఇబ్బందులను తొలగించి మేస్త్రీలు, కూలీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మిక సంక్షేమ చట్టం 1996, ఆంధ్రప్రదేశ్ నిబంధనలు-1999ను అమలు చేస్తున్నాయి. కేవలం నామమాత్రపు రుసుంతో కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకున్న వారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తూ వారికి ఆదరవుగా నిలుస్తోంది సంక్షేమ చట్టం. భవన నిర్మాణ రంగంలోని ఏ విభాగంలోని వారైనా సంక్షేమ చట్టంలోని ప్రయోజనాలను పొందేందుకు అర్హులేనని, వారు చేయాల్సిందల్లా కేవలం కార్మిక శాఖ వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవడం మాత్రమేనని చెబుతోంది ఈ చట్టం.

నమోదుకు కావాల్సిన అర్హతలు

- 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న భవన నిర్మాణ కార్మికులు అర్హులు.
- వయస్సు ధృవీకరణ కోసం రేషన్ కార్డు, ఓటరు కార్డు, జనన లేక స్కూలు సర్టిఫికెట్ జిరాక్స్ పత్రాలు అందజేయాలి.
- నమోదు చేసుకోవాల్సిన రోజుకంటే ముందు 90 రోజులకు తగ్గకుండా నిర్మాణ రంగంలో పనిచేయాల్సిన అనుభవం కలిగి ఉండాలి.
- నమోదుకు రూ.110 (రూ.50+రూ.60) చెల్లించి సంబంధిత కార్మిక శాఖాధికారి ద్వారా 5 సంవత్సరాలకు ఒకేసారి నమోదు చేయించుకోవచ్చు. తరువాత రూ.60 చెల్లించి 5 ఏళ్లకు ఒకేసారి రెన్యువల్ చేయించుకోవచ్చు.

సంక్షేమ బోర్డు ద్వారా లభించే ప్రయోజనాలు

- పనిచేసే ప్రదేశాల్లో మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షల పరిహారం
- 50 శాతం లేదా అంతకు మించి అంగవైకల్యం పొందిన వారికి రూ.లక్ష పరిహారం.
- 26 శాతం నుంచి 49 శాతం వరకు అంగవైకల్యం కలిగిన వారికి రూ.50 వేలు పరిహారం.
- 25 శాతం వరకు అంగవైకల్యం పొందిన వారికి రూ.25 వేలు పరిహారం.
- సాధారణ మరణం పొందిన వారికి రూ.60 వేల ఆర్థిక సాయం.
- కార్మికుడి భార్యకు రెండు కాన్పులకు రూ.20 వేల ప్రసూతి సాయం లభిస్తుంది.
- భవన నిర్మాణ కార్మికులకు అనారోగ్య సమయంలో రోజుకు రూ.300 చొప్పున నెలకు రూ.3 వేలకు మించకుండా మూడు నెలల వరకు చెల్లిస్తారు.
- అంతిమ సంస్కార ఖర్చులకు రూ.20 వేలు చెల్లిస్తారు.
- జాతీయ నిర్మాణ శిక్షణ సంస్థ(న్యాక్) ద్వారా కార్మికులకు ఎలక్ట్రికల్, తాపీ పని, ప్లంబింగ్, పెయింటింగ్, బార్ బెండింగ్, వడ్రంగి విభాగాలలో రోజుకు రూ.300 శిక్షణ భృతి చెల్లిస్తూ ఉచిత, భోజన, వసతి సౌకర్యాలతో శిక్షణ అందిస్తారు.
- ఏ పింఛను పథకం కింద సభ్యులుగా నమోదు కాని వారికి జాతీయ పింఛను పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారు.
- బోర్డు ద్వారా గుర్తింపు కార్డు పొందిన అవివాహితులైన మహిళా కార్మికులు, లబ్ధిదారులైన కార్మికుల కుమార్తెలకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని వివాహ కానుకగా అందిస్తారు.
- కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డు పొందని కార్మికులు కూడా ప్రమాదంలో మరణిస్తే రూ.50 వేలు లేదా ప్రమాదం జరిగితే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరక ఆర్థిక సాయం అందిస్తారు.

విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం...



కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు పొందిన వారికి లభించే ప్రయోజనాల గురించి కార్మికుల్లో విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నాం. అవగాహన లేమి, నిరక్షరాస్యత కారణంగా చాలా మంది ఈ పథకానికి దూరంగా ఉంటున్నారు. పీలేరు కార్యాలయం పరిధిలోని పీలేరు, కేవీపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, ఐరాల, తవణంపల్లె, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళం, పాకాల మండలాల నుంచి 2009 నుంచి 2024 వరకు 14,661 కార్మికులు నమోదు చేసుకున్నారు. వారిలో కేవలం 60 శాతం మంది మాత్రమే రెన్యువల్ చేసుకున్నారు. వారందరినీ గుర్తించి వారు కూడా రెన్యువల్ చేయించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాం. తమ దగ్గర పనిచేసే కార్మికులను తాపీ మేస్త్రీలు విధిగా కార్మిక శాఖ వద్ద నమోదు చేయించాలి. అప్పుడే ఈ పథకం అందరికీ అందుతుంది.

● ఆనంద్, సహాయ కార్మిక శాఖాధికారి, పీలేరు



పీలేరులో భవన నిర్మాణంలో కార్మికులు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

వాల్మీకిపురం, నవంబరు 14: సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అలా కాదని నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో చుక్కల భూముల రీవెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, చుక్కల భూముల సమస్యలు, రెవెన్యూ సేవల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎప్పటికప్పుడు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్, అపార్ కార్యక్రమాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో ఎక్కడా రెవెన్యూ సమస్యలు ఉండకూడదని ఆ దిశగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన లేఔట్లలో కాలనీ నివాసాల అమ్మకాలు, కొనుగోలు చేసినా ప్రభుత్వ చ ర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి శాఖకు చెందిన అధికారులు కూడా తమ వి ధుల విషయంలో నిర్లక్ష్యం చూపక ప్రజలకు సేవలందించాలన్నారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రం, రోడ్లు పరిశీలన

వాల్మీకిపురం మండలంలోని నాలుగవ అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కేంద్రంలో పరిధిలో ఉన్న పిల్లలు, రోజువారీ హాజరు తదితర వివరాలను ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం జర్రావారిపల్లె, చింతలవారిపల్లె గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మదనపల్లె ఆర్డీవో రాఘువేంద్ర, డ్వామా పీడీ వెంకటరత్నం, డీఎల్డీవో ఆనందరెడ్డి, హౌసింగ్ ఈఈ నీలకంఠదాస్, ఏపీడీ శ్రీనివాసులు, పీఆర్ డీఈ మధు, తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీవో మనోహర్‌రాజు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ ఫలాలు అందాలనే పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మదనపల్లె అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగలకు అందాలనే పోరాటం చేస్తున్నామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం మదనపల్లె పట్టణం, చౌడేశ్వరీ కల్యాణ మండపంలో నిర్వహించిన చిత్తూరు ఉమ్మడి జిల్లా మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మాదిగల ఎస్సీ వర్గీకరణతో పాటు సమాజం కోసం పోరాటాలు, ఆందోళనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేస్తే మాదిగలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారని చెప్పారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వేషన్ కోసం 59 కులాలు పోరాటాలు చేస్తుంటే మాలలు ఒక కులం మాత్రం వ్యతిరేకించడం దారుణమన్నారు. దశాబ్దాల పోరాటాల ఫలితమే ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ సాధించామన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వానికి అన్ని విధాలుగా మాదిగలు పూర్తి సహకారం అందించినప్పటికీ జగన్ మాత్రం ఐదేళ్లలో ఐదు నిమిషాలు కూడా ఎస్సీ వర్గీకరణ గురించి మాట్లాడలేదని అన్నారు. చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణకు సహకారం అందించారని చెప్పారు. మాదిగల గురించి పట్టించుకోని జగన్‌కు మద్దతుగా ఉండాలా, లేదా మాదిగలకు అన్ని విధాల సహకారం ఇస్తున్న నారాచంద్రబాబుకు మద్దతుగా ఉండాలా అని మాదిగలు నిర్ణయం తీసుకోవాలన్నారు. ముందుగా వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మౌలాలీ ఆధ్వర్యంలో మందకృష్ణమాదిగను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకులు నరేంద్రబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర(రవి), ఎంఎస్‌పీ నియోజకవర్గ నాయకులు ఆరేటి వాసు, పాల్గొన్నారు.

వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీగా శశిధర్‌రెడ్డి

కలికిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం (డీఆర్సీ) సహాయ సంచాలకులుగా ఆర్. శశిధర్‌రెడ్డిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో గ్రామీణాభివృద్ధి శాఖకు డిప్యుటేషన్‌పై వెళ్లిన శశిధర్ రెడ్డిని గత నెల 23న తిరిగి మాతృ సంస్థ వ్యవసాయ శాఖకు పంపించారు. దీంతో ఆయనను జిల్లా వనరుల కేంద్రం రాయచోటిలో ఏడీగా నియమిస్తూ గురువారం వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ఆదేశాలు జారీ చేశారు.

ఆక్రమణలపై చర్యలు వేగవంతం

- రాయచోటి ఆర్డీవో సహా మరో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు నోటీసులు
- నలుగురు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు...
- ఐదుగురు టౌన్ ప్లానింగ్ అధికారులు ... ఎంపీడీవోకూ నోటీసులు

కడప/కలికిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప కేసీ కెనాల్‌కు చెందిన భూముల ఆక్రమణలకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన 20 మంది అధికారులను బాధ్యులుగా చేస్తూ గత నెల 30వ తేదీన వారందరికీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి వారి సంజాయిషీలను పేర్కొంటూ 10 రోజుల్లోగా జవాబివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. గడువు ముగిసిన వెంటనే వారు సమర్పించిన సంజాయిషీలతో సంతృప్తి చెందని ప్రభుత్వం తాజాగా ఒక్కొక్కరికీ విడివిడిగా మరోసారి చార్జిషీట్లను జారీ చేసింది. అభియోగాల్లోని అంశాల వారీగా వివరణలు అందజేసేందుకు నిబంధనల ప్రకారం మరోసారి ఈ నోటీసులు జారీ చేసింది.

ఈ దఫా జారీ అయిన వారిలో ప్రస్తుత రాయచోటి ఆర్డీవో ఎ.శ్రీనివాస్‌తో సహా ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లు, నలుగురు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, ఐదుగురు టౌన్ ప్లానింగ్ అధికారులు కాగా మరొకరు చిట్వేలిలో పనిచేసిన ఎంపీడీవో ఉన్నారు. ఈసారి 13 మందికి మాత్రం ఈ నోటీసులు జారీ కాగా వారందరికీ గతంలో వలే కలిపి కాకుండా విడివిడిగానే వేర్వేరుగా జీవోలు జారీ చేసింది. బుధవారం రాత్రి ఈ మేరకు జీవోలు విడుదలయ్యాయి.

కేసీ కెనాల్ ఆక్రమణల వ్యవహారమేంటి?

కేసీ కెనాల్ భూములు ఆక్రమించిన తీరు గురించి తాజాగా జారీ అయిన నోటీసుల్లో ప్రభుత్వం కూలంకషంగా వివరించింది. కడప కేసీ కెనాల్‌కు సంబంధించిన కాలువ పక్కన వున్న గూడూరు గ్రామానికి చెందిన పలు సర్వే నెంబర్లలోని కాలువ కట్ట పోరంబోకు భూముల్లో 7.76 ఎకరాలను ఆక్రమించి రియల్ ఎస్టేట్ మాఫియా వెంచర్లు వేసింది. దీని కోసం కొత్త రామరాజుపల్లె వద్ద కేసీ కెనాల్ సైఫన్‌ను కూడా కూల్చేసి సిమెంటు రోడ్లు వేశారు. ఇక్కడ విజయదుర్గ కాలనీ పేరుతో ఇళ్ల స్థలాలను అభివృద్ధి చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు 2004 జూలైలో ఈ ఆక్రమణలు మొదలుపెట్టారు. ఆక్రమణలను అడ్డుకోవడంలోనూ, ఇండ్ల స్థలాల అభివృద్ధిని నిరోధించడంలోనూ, ప్లాట్లను యథేచ్ఛగా అమ్ముతున్నా అడ్డుకోవడంలోనూ జలవనరుల శాఖ, కడప మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. కాలువ భూముల ఆయకట్టుకు సంబంధించిన మైదుకూరుకు చెందిన కొంతమంది రైతులు, కడప బీజేపీ నాయకుడు ఎల్.రామమోహన్ రెడ్డి చివరికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శాఖ అధికారులు కేసీ కెనాల్ భూముల ఆక్రమణ, విజయదుర్గ లేఔట్ ఏర్పాటు, అధికారుల సహకారం తదితర అంశాల్లో లోతుగా విచారణ చేసి వాస్తవాలను ప్రభుత్వానికి నివేదించింది. అయితే ఈ వ్యవహారం 2014 వరకూ ఎక్కడికక్కడే నిలిచిపోయింది.

ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం దీనిని తిరిగీ లోతుగా పరిశీలించేందుకు చర్యలు తీసుకుంది. అన్ని అడ్డంకులు అధిగమించి విచారణ, తదుపరి చర్యలపై కార్యాచరణ ఒక కొలిక్కి వస్తున్న దశలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఆ తరువాత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇది పూర్తిగా తెరమరుగైంది, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేసీ కెనాల్ ఆక్రమణల బాగోతం వెలుగులోకి వచ్చింది.

బాధ్యులైన అధికారులు..

కేసీ కెనాల్ భూముల ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అప్పటి కడప మండల తహసీల్దార్లుగా పనిచేసిన ఎల్.రవిశంకర్‌రెడ్డి (ప్రస్తుతం యూత్ వెల్ఫేర్ ఆఫీసర్, అనంతపురం), ఎస్.ప్రేమనాథ కుమార్ (జనరల్ మేనేజర్, ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్, విజయవాడ), ఎ.శ్రీనివాస్ (ఆర్డీవో, రాయచోటి), మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లుగా పనిచేసిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి (డిప్యూటీ కమిషనర్, తిరుపతి), సి.ఓబులేశు, (కమిషనర్, శ్రీకాకుళం), డి.జన్‌శామ్‌సన్ (తెలంగాణా రాష్ట్రం), ఎస్.అలీమ్ బాషాలున్నారు.


ఇక కార్పొరేషన్ ఉద్యోగులు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ టీసీ కృష్ణ సింగ్ (డీటీసీపీ, కడప), టీపీబీవో జి.శారదాంబ, (టీపీఎస్, తిరుపతి), టీపీబీవో జి.నాగశివప్రసాద్ (టౌన్ ప్లానింగ్ ట్రేసర్, కడప), టీపీబీవో టి.ఎం.రెహ్మాన్ (టీపీవో, హిందూపురం), టీపీఎస్ బి.విజయభాస్కర్ (ప్లానింగ్ ఆఫీసర్, కర్నూలు పట్టణాభివృద్ధి సంస్థ), గూడూరు పంచాయతీ కార్యదర్శి ఎస్.శివరామి రెడ్డి (ఎంపీడీవో, చిట్వేలి తాజాగా గడివేముల కర్నూలు)లు ఉన్నారు. కాగా గత నెల 30వ తేదీన జారీ చేసిన అభియోగ పత్రంలో పోలీసు శాఖ నుంచి ఒక డీఎస్పీ, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, జలవనరుల శాఖకు సంబంధించి నలుగురు ఈఈలు కూడా ఉన్నారు. ప్రస్తుతానికి వీరికి మాత్రం ఎలాంటి నోటీసులు జారీ కాలేదు.

పోసానిపై టీడీపీ నేతల ఫిర్యాదు

రాజంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా సోషల్ మీడియాలో తీవ్ర పదజాలంతో దూషించిన పోసాని కృష్ణమురళిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు కోవూరు సుబ్రమణ్యంనాయుడు, అబూబకర్ గురువారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోషల్‌మీడియాను దుర్వినియోగం చేస్తూ పోసాని చేసిన వ్యాఖ్యల వివరాలున్న పెన్‌డ్రైవ్‌ను ఎస్‌ఐకి అందజేశారు. కార్యక్రమంలో శవనవారిపల్లె సర్పంచ్ కోటయ్యనాయుడు, గ్రామీణ ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, పట్టణ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే కరీం, టీడీపీ నాయకులు పాండురాజు, గుణశంకర్ పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో జాతీయస్థాయికి ఎంపిక

ఓబులవారిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నఓరంపాడు జడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థినులు భాను, సారా జాతీయ స్థాయి టెన్నిస్ క్రికెట్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. అక్టోబరులో చెన్నైలోని విల్లుపురంలో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు మొదటి స్థానం సాధించడంలో వారు కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి జమ్ము కశ్మీర్‌లోని జమ్మూతావిలో జరగబోయే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు.



ఎగుమతి చేసేందుకు క్రేట్లలో పేర్చిన దానిమ్మ కాయలు

నష్టాల...దానిమ్మ

- కుప్పకూలిన ధర... కేజీ రూ.200 నుంచి రూ.50కి
- సైజు లేకుంటే రూ.30...
- దిక్కుతోచని స్థితిలో దానిమ్మ రైతులు
- నష్టాలతో రైతన్నలు ఉక్కిరిబిక్కిరి

ములకలచెరువు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు చివరకు నష్టాలే మిగులుతున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న దానిమ్మ పంట రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. బయటి మార్కెట్‌లో దానిమ్మ ధరలు కుప్పకూలిపోయాయి. కేజీ రూ.200 నుంచి రూ.50కు పడిపోయింది. కాయలు సైజు లేకుంటే కేజీ రూ.30కే అడుగుతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధర మాత్రం పతనమైంది. ఇటీవల తుఫాను కారణంగా వచ్చిన వర్షాలు దానిమ్మ తోటలను దెబ్బతీశాయి. అధిక శాతం కాయలపై మచ్చలు వచ్చాయి. దీంతో దానిమ్మ రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



మచ్చలు వచ్చిన దానిమ్మ కాయలు

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో దానిమ్మ దిగుబడి పెరగడం, ఇక్కడి కాయలకు మచ్చలు రావడంతో ధరలు పడిపోవడానికి కారణమైంది.

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె మండలాల్లో సుమారు 300 ఎకరాల్లో దానిమ్మ తోటలు సాగులో ఉన్నాయి. డ్రిప్ ఇరిగేషన్ కింద తోటలు సాగు చేశారు. ఎకరా దానిమ్మ సాగుకు రూ.1.50 లక్షల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం దానిమ్మ తోటలు దిగుబడి వస్తున్నాయి. కాయలు కూడా విరగ్గాశాయి. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా కాయలపై మచ్చలు వచ్చాయి. గత నెలలో తుఫాను కారణంగా కురిసిన వర్షానికి అధిక శాతం కాయలపై మచ్చలు ఏర్పడ్డాయి. దీనికి తోడు ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కూడా దానిమ్మ దిగుబడులు అధికంగా వస్తుండడంతో అక్కడి కాయలపై మచ్చలు లేని కారణంగా ఇక్కడి కాయలకు డిమాండ్ తగ్గింది.

20 రోజుల క్రితం వ్యాపారస్తులు తోటల వద్దకు వచ్చి కేజీ రూ.200తో కొనుగోలు చేశారు. ప్రస్తుతం కేజీ రూ.50కి అడుగుతున్నారు. కాయలపై మచ్చలు అధికంగా ఉండడంతో 150 గ్రాములు ఉన్న కాయలను మాత్రం కేజీ రూ.50తో కొనుగోలు చేశారు. 150 గ్రాముల కంటే తక్కువ పరిమాణం ఉన్న కాయలను కేజీ రూ.30తో అడిగారు. బుధవారం కాయలను కోత చేసి క్రేట్లలో పేర్చి కాయలను తమిళనాడు రాష్ట్రం చెన్నైకి వాపారస్తులు తీసుకెళ్లారు. ఆరు ఎకరాలకు 20 టన్నుల దిగుబడి వచ్చినా ధర లేకపోవడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. పంట నోటికాడికి వచ్చే సమయంలో ధరలు పతనం కావడంతో దానిమ్మ రైతులు మదనపడుతున్నారు.

నీటి తడులు తక్కువ... పెట్టుబడులు ఎక్కువ

రాజస్థాన్ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం ఉంటుంది. ఆ ప్రాంతంలో రైతులు దానిమ్మ సాగు చేసి అధిక లాభాలు గడించారు. ఇక్కడ కూడా భూగర్భజలాలు అంతంతమాత్రంగా ఉండడంతో డ్రిప్ పద్ధతిలో తక్కువ నీటితో పండించే పంటలపై రైతులు మొగ్గు చూపారు. పడమటి మండలాల్లో దానిమ్మ తోటలను విస్తారంగా సాగు చేశారు. అధిక ధరలు వెచ్చించి మందులు పిచికారీ చేసినా తెగుళ్లు, బ్యాక్టీరియా నివారణ చేయలేక పోతున్నారు. దీనికి తోడు ప్రతి ఏటా తుఫాన్ల కారణంగా కురుస్తున్న వర్షాలకు కాయలపై మచ్చలు ఏర్పడుతున్నాయి. దానిమ్మ సాగుకు పెట్టుబడి కూడా ఎక్కువే. మొక్కలు, ఎరువులు, కూలీల ఖర్చు, మొక్కలు నాటడానికి, డ్రిప్ తదితర వాటికి మొదటి ఏడాది ఎకరాకు రూ.1.50 లక్ష ఖర్చు వస్తోంది. రెండవ ఏడాది రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఒకసారి తోట సాగు చేస్తే పదేళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

మచ్చలతో తీవ్ర నష్టం

- కిరణ్‌కుమార్, రైతు, గూడుపల్లె

నేను ఆరెకరాల్లో దానిమ్మ సాగు చేశాను. గత నెలలో కురిసిన తుఫాను కారణంగా కాయలకు మచ్చలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ధరలు కూడా పతనమయ్యాయి. 20 రోజుల క్రితం వరకు కేజీ రూ.200 ఉండేది. ప్రస్తుతం రూ.50కు చేరింది. దీంతో తీవ్రనష్టం వచ్చింది.



గూడుపల్లె సమీపంలో ఉన్న దానిమ్మ తోట

జిల్లాలో కరవు మండలాలు లేవా ?

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్



మాట్లాడుతున్న సీపీఎం నేత గఫూర్

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో 54 కరువు మండలాలు ప్రకటిస్తే కనీసం కడప జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా మీకు కనబడలేదా అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎగఫూర్ ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో భారం మోపడం సరికాదని ఆయన మండిపడ్డారు. మరో పక్క విద్యుత్ స్మార్ట్‌మీటర్లు రద్దు కోసం సమరశీల పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. నిధులు నికర జలాలు, విభజన హామీలు అమలు సమగ్రాభివృద్ధి కోసం జిల్లా పట్ల వివక్ష విడనాడాలన్నారు. మహాధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శి వర్గసభ్యులు దస్తగిరిరెడ్డి, సత్యం, శ్రీనివాసులరెడ్డి, అన్వేష్, నగర నేతలు చంద్రారెడ్డి, బద్వేలు నుంచి చాంద్‌బాషా, వెంకటేశ్, ఒంటిమిట్ట నుంచి నరసయ్య, జమ్మలమడుగు నుంచి యేసుదాసు, విజయ్, శివనారాయణతో వివిధ మండలాల నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రారు పద్మ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైవీయూ డిగ్రీ ఎల్ఎల్‌బీ సెమిస్టరు పరీక్ష ఫలితాలను ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, సహాయ నియంత్రణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు విడుదల చేశారు. చాంబరులో ఫలితాలపై మాట్లాడుతూ ఎల్ఎల్‌బీ ఐదేళ్ల రెండో సెమిస్టరులో 113 మంది హాజరుకాగా, 67 మంది (59శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. 4వ సెమిస్టరులో 87మందికి 9 మంది (10శాతం) ఉత్తీర్ణులయ్యారన్నారు. 6వ సెమిస్టరులో 79మందికి 59మంది (74శాతం), 8వ సెమిస్టరులో 73 మందికి 53 మంది (72శాతం) 10వసెమిస్టరులో 122 మందికి 108మంది (88శాతం) ఉత్తీర్ణతసాధించారన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాల్లో

డిగ్రీపరీక్షలకు సంబంధించి బీఏ 7వసెమిస్టరు ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బీబీఏ వంద శాతం, బీకాం వంద శాతం, బీఎస్సీ 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారన్నారు. బీఏ 8వ సెమిస్టరు పరీక్షల్లో 97శాతం, బీబీఏ 93 శాతం, బీకాం వంద శాతం, బీఎస్సీ 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

పెద్ద దర్గా ఉరుసును దిగ్విజయం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న దర్గా ప్రతినిధులు

కడప కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడపలో వెలసిన ప్రఖ్యాత పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 16వ తేదీ శనివారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా ఉత్సవాలను దిగ్విజయం చేసేందుకు తప్పక హాజరవాలని దర్గా ప్రతినిధులు అమీర్, కుత్‌బుద్దీన్ కోరారు. పెద్దదర్గాలో వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు మలంగ్‌షా సర్‌గిరీలు, ఫకీర్లు బాదుల్లా సాహిబ్ మకాన్‌వద్దకు చేరుకుని చదివింపులు చేస్తారన్నారు. తదుపరి ఊరేగింపుగా దర్గా చేరుకుంటుందన్నారు. రాత్రి 9 గంటలకు ఖవ్వాలి, 10 గంటలకు పీఠాధిపతి నివాసం నుంచి గంధం ఊరేగింపుగా దర్గాచేరుకుని, ఫాతేహా చేసి గంధము సమర్పించనున్నట్లు వెల్లడించారు. 17న సాయంత్రం ఇదార-యే-అమీనియా చిష్టియా వార్షిక నివేదిక సమర్పణ, ఉరుసు ఉత్సవం వేడుకగా జరుగనుందన్నారు. 18న సాయత్రం 5 గంటలకు పీఠాధిపతి మహానైవేద్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 19న విద్వాంసులచే రాత్రి 10 గంటల నుంచి ఖవ్వాలి వుంటుందన్నారు. 20న పీఠాధిపతి శిష్యులతో కలిసి హజరత్ మస్తాన్ స్వామి తపస్సు చేసిన శ్రీ శేషాచల పర్వతంలోని గుహ వద్ద జెండా ప్రతిష్ఠ చేయనున్నారన్నారు.

ఘనంగా సానపురెడ్డి ఓబులమ్మ వర్ధంతి

చిన్నారులకు దుప్పట్లు పంపిణీ



సానపురెడ్డి ఓబులమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న రాంగోపాల్ రెడ్డి, తదితరులు

బద్వేలు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బోవిళ్లవారిపల్లె వాసులు సానపురెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాధాక్రిష్ణరెడ్డి మృత్యుమూర్తి సానపురెడ్డి నాగ ఓబులమ్మ 2వ వర్ధంతి నిర్వహించారు. ఆమె కుమారులు సానపురెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాధాక్రిష్ణరెడ్డి సహకారంతో గురువారం సిద్దవటం రోడ్డులోని షాలోమ్ అనాథ శరణాలయం చిన్నారులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు, మధ్యాహ్న భోజనం అందించారు. మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి వీటిని పంపిణీ చేశారు. అనాథ శరణాలయంలో నాగ ఓబులమ్మ చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నేతలు నివాళులర్పించారు. నాగ ఓబులమ్మ భర్త గోపాల్‌రెడ్డి పట్టణంలో అందరికీ సుపరిచితులు కావడంతో ఈ కార్యక్రమానికి పలువురు హాజరై నివాళులర్పించారు.

ఉల్లి విత్తనాల వ్యాపారిపై కేసు నమోదు చేయాలి

కల్తీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు



పొలాల్లోనే వదిలేసిన ఉల్లిపంటను చూపుతున్న రైతు

వీరపునాయునిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కల్తీ ఉల్లి విత్తనాలు అమ్మి రైతులను మోసగించిన వ్యాపారి మైదుకూరు గురవయ్యపై కేసు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కొమ్మద్ది గ్రామంలో చాలా మంది రైతులు కల్తీ ఉల్లి విత్తనాలు చల్లి దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారని రైతులు కె.ఈశ్వరయ్య, రామాంజనేయులు, పోతులయ్య, విశ్వనాథ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పదెకరాల్లో కల్తీ విత్తనాలతో రైతులు నష్టపోయారని వారు తెలిపారు. జూలైలో గురవయ్య దగ్గర సేరు ఉల్లి విత్తనాలు రూ.1400తో కొనుగోలు చేశామన్నారు. పంటను కాపాడుకున్నా చివరకు ఉల్లి గడ్డలు ఊర లేదన్నారు. ఎకరా సాగుకు రూ.70వేలు పెట్టుడులు పెట్టామన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

హైవే భూ సేకరణ పనులు పరిశీలించిన జేసీ



మ్యాపును పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

ప్రొద్దుటూరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి - వేంపల్లే హైవే నిర్మాణం కోసం భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. గురువారం ఆమె ప్రొద్దుటూరులోని నేషనల్ హైవే కోసం పోయే భూ ములను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గోపవరం పంచాయతీ ప్రొద్దుటూరు కొత్తపల్లె నంగనూరు పల్లె పొలాల్లో 42.328 ఎకరాలు భూసేకరణ చేపట్టాల్సివుందన్నారు. వీటి సర్వే నెంబర్లు భూరికార్డులు పరిశీలించారు. పరిశీలనలో తహసీల్దారు గంగయ్య ఆర్‌ఐ నాగమోహన్ రెడ్డి సర్వేయర్ వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా 'నాడు - నేడు'



అసంపూర్తిగా ఉన్న భవనం

కలగా మారిన ఇంటర్ భవన నిర్మాణాలు ● ఇబ్బందుల్లో విద్యార్థినులు

భవనాల కోసం తప్పని ఎదురుచూపులు ● ఇప్పటికైనా పూర్తి అయ్యేనా

వీరబల్లి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగానే జరిగాయి. 'నాడు - నేడు' పథకంలో భాగంగా ప్రతి పాఠశాలనూ అభివృద్ధి చేద్దామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా పనులు ప్రారంభించింది. ఈ పథకం అస్మదీయులకు లబ్ధిచేకూరేందుకే ఏర్పాటు చేసినట్లుగా తయారైంది. వీటి పనులు కూడా వారికే కట్టబెట్టడంతో వారు చేసేదే పని, ఎప్పుడు పూర్తవుతాయో అడగకూడని పరిస్థితి. మంజూరైన వాటిలో కొన్నింటిని పూర్తి చేసినా నిరుపయోగంగా ఉండడం, మరికొన్ని అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇందులో భాగంగా కస్తూర్బా జూనియర్ కళాశాల భవనాలు నిధుల్లేక అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఇంటర్ విద్యార్థినుల కోసం భవనాలు లేకపోవడం చేపట్టక పోవడంతో భవనిర్మాణాలు జరిగేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై స్థానికులు, విద్యార్థినుల తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకెళితే...

స్థానిక కస్తూర్బా పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండడంతో పంచాయతీల్లోని విద్యార్థులే కాకుండా బయటి ప్రాంతాల నుంచి అనేక మంది విద్యార్థినులు ఇక్కడ 6వ తరగతిలో చేరుతున్నారు. 10వ తరగతి విద్యా ప్రమాణాలు పెంపొందించుకుంటున్నారు. కస్తూర్బా పాఠశాలలో ఇంటర్మీడియేట్ విద్యను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో పాఠశాలలో చేరికలు పెరిగిపోయాయి. ఫలితంగా తరగతి గదులు తక్కువ రావడంతో నాడు- నేడు కింద కస్తూర్బా జూనియర్ కళాశాలకు భవనాలు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో నాడు- నేడు కింద మంజూరైన కస్తూర్బా జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు ప్రతి పాదనలు, ఆర్భాటాలు తప్ప తగినన్ని నిధులు కేటా యించక పోవడంతో సదరు కాంట్రాక్టర్లు అర్ధంతరంగా పనులు ఆపేశారు. అంతేకాకుండా పనులపై పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపంతో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి అసౌకర్యాల నడుమ విద్యార్థినులు విద్యను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధించిన జిల్లా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టి విద్యార్థినులకు తగిన సౌకర్యాలు కల్పించి వారి విద్యా ప్రమాణాలను పెంపొం దించేందుకు కృషి చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. భవ నాలు పూర్తి అయితే అన్ని సదుపాయాలు, తమ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం



తమ పాఠశాలలో సరైన వసతులు లేక ఇబ్బంది లు పడుతున్నాం. తాగడానికి నీరు కూడా సక్రమంగా అందడం లేదు. ఉన్న బోరులో నీరు అడు గంటిపోయాయి. బయట నుంచి క్యాన్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. మాకు సకాలంలో సరైన వసతులు కల్పిస్తే విద్యా ప్రమాణాలు పెంపొందించుకుంటాం.

నాగలక్ష్మి, జూనియర్ ఇంటర్

భవనాలు పూర్తి చేయండి



నాడు- నేడు కింద తమ పాఠశాలకు అదనంగా ఇంటర్మీడియట్ భవనాలు మంజూరయ్యాయి. అవి నిధులు లేక అర్ధాంతరంగా ఆగిపోయాయి. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి తమ విద్యాభివృద్ధికి సహకరించాలి.

దీపిక, జూనియర్ ఇంటర్

బైక్, ట్రాక్టర్ ఢీ - ఇద్దరికి తీవ్రగాయాలు

అడ్డు, అదుపులేకుండా అక్రమంగా బోల్డర్స్ తరలింపు ● ఘటన తరువాత ట్రాక్టర్‌లో బోల్డర్స్ మాయం



ఘటనా స్థలంలో ట్రాక్టర్ కింద పడిన వ్యక్తి

ముద్దనూరు నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్లలో అక్రమ బోల్డర్స్ తరలింపు అడ్డూ అదుపులేకుండా పోయింది. కొండ ప్రాంతంలోని భూముల నుంచి బోల్డర్స్ తరలిస్తున్నారు. ట్రాక్టర్ల వేగానికి అదుపులేకుండా పోతోంది. గురువారం జమ్మలమడుగు రోడ్డులోని ప్రభుత్వ ఇళ్ల లేఔట్ సమీపంలో బోల్డర్స్ తరలిస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో ఒకరికి రెండు చేతులకు గాయాలు, ఛాతికి తీవ్రగాయమైంది. మరొకరు బైకు నుంచి కింద పడడంతో తల వెనుక తీవ్రగాయమైంది. అయితే ట్రాక్టర్‌లో బోల్డర్స్ ఉంటే కేసు అవుతుందని ట్రాక్టర్ యజమాని గ్రహించినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను మరో చోటి తీసుకెళ్లి బోల్డర్స్ అన్‌లోడు చేసి ఎంతో చాకచక్యంగా ఖాళీ ట్రాక్టర్‌ను ప్రమాద స్థలంలో నిలిపారు. ఇంత జరుగుతున్నా పోలీసుల తీరుపై పలు విమర్శలు వినిపిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు వివరాల్లోకెళితే....

కొండాపురం మండలం ఓబన్నపేట వాసులు సురేంద్రారెడ్డి, బాబు బైక్‌లో జమ్మలమడుగుకు వెళుతున్నారు. ప్రభుత్వ ఇళ్ల లేఔట్ సమీపం నుంచి ముద్దనూరుకు చెందిన ట్రాక్టర్ మట్టి రోడ్డు గుండా కొండ ప్రాంతం నుంచి బోల్డర్స్ తీసుకుని వస్తోంది. జామాయిల్ చెట్ల ప్రాంతంలో మెయిన్ రోడ్డు పైకి ట్రాక్టర్‌ను అతి వేగంగా తిప్పాడు. ఉన్నఫళంగా ట్రాక్టర్ రోడ్డుపైకి రావడంతో ముద్దనూరు వైపు నుంచి వస్తున్న బైక్ పైకి రావడంతో ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ మధ్యలో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైకు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. సురేంద్రారెడ్డి తలకు హెల్మెట్ పెట్టుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. రెండు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ఛాతీకి తీవ్రగాయమైంది. బైకులో వెనుక కూర్చున్న బాబుకు తల వెనుక తీవ్రగాయమైంది. వెంటనే 108లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్క డ వైద్యం అందించి కడపలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

అదుపు లేకుండా బోల్డర్స్ తరలింపు

ట్రాక్టర్ల యజమానులు అడ్డు, అదుపు లేకుండా అక్రమంగా బోల్డర్స్ తరలిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండ ప్రాంతం నుంచి పునాదుల కోసం కొండ రాళ్లను తరలిస్తున్నారు. ట్రాక్టర్లు అతివేగంగా వస్తుంటాయి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించకుండా వస్తుండడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నదానికి ఇదే నిదర్శనమని ప్రజలు అంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

బోల్డర్స్ తోలుకునేందుకు రెవెన్యూ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. రెవెన్యూ సిబ్బందిని పంపి పరిశీలిస్తాం. కొండ ప్రాంతంలో కొందరికి డీకేటీ పట్టాలు ఇచ్చారు. ఆ భూమిలో ఉన్న బోల్డర్స్‌ను కొందరు ట్రాక్టర్ యజమానులు తోలుకుంటున్నారు. భూమి సాగు పనులు చేస్తున్నారా అన్నదాని పూర్తి వివరాలు సేకరిస్తాం. తదుపరి తగుచర్యలు తీసుకుంటాం.

వరదకిశోర్‌రెడ్డి, తహసీల్దారు,ముద్దనూరు

అర్ధరాత్రి ఇసుక రీచ్‌ల తనిఖీ

రెండు టిప్పర్లు సీజ్ చేసిన ఆర్డీఓ

కొండాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుక రీచ్‌లను గురువారం అర్ధరాత్రి జమ్మలమడుగు ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ తనిఖీ చేశారు. తిమ్మాపురం క్రాస్ వద్ద గురువారం ఒంటిగంటకు ఆర్డీఓ వాహనాలను సిబ్బందిచే తనిఖీ చేయించారు. ముందస్తు సమాచారంతో తెల్లవారుజామున ఆర్డీఓ ఆకస్మిక దాడులు నిర్వహించారు. బిల్లులు లేకుండా ఇసుకను తీసుకెళుతుండగా రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు నంద్యాల వైపు వెళుతున్న రెండు ఇసుక టిప్పర్లను సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వర‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప పాల్గొన్నారు.

నిందితులకు జైలు శిక్ష

బద్వేలుటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు ప్రేరేపితులు, ఆంజనేయనగర్ వాసులు భూమిరెడ్డి శివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డికి మూడేళ్ల జైలు, రూ.1000 జరిమానా కోర్టు విధించింది. వివరాల్లోకెళితే....

2014లో భూమిరెడ్డి రామసుబ్బారెడ్డిని మోసంచేసి, బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించడంతో అతను చనిపోయాడు. ఈమేరకు నిందితులు భూమిరెడ్డి శివారెడ్డి, భూమిరెడ్డి శాంతమ్మ, భూమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, భూమిరెడ్డి ఇంద్రసేనారెడ్డిపై కేసు నమోదు చేశారు. విచారణ సమయంలో భూమిరెడ్డి శాంతమ్మ, భూమిరెడ్డి ఇంద్రసేనారెడ్డి మరణించడంతో మొదటి నిందితుడు భూమిరెడ్డి శివారెడ్డికి, మూడో నిందితుడు భూమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిలకు శిక్షను ఖరారు చేశారు. పదేళ్ల కిందటి కేసులో నేడు కోర్టు శిక్షను తీర్మానించింది.

మహిళ అదృశ్యం

కడప(క్రైం)నవంబరు14(ఆంధ్రజ్యోతి): కడప నగరం వైఎస్ ఆర్ కాలనీకి చెందిన మహిళ అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్‌ఐ రాజరాజేశ్వర్ రెడ్డి తెలిపారు. సత్యసాయి జిల్లాకు చెందిన రాగుల వెంకట రమణ జీవనోపాధి నిమిత్తం వైఎస్ ఆర్ కాలనీలో ఉంటున్నాడు. జీపు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. భార్య రాగుల వైశాలి ఇంటివద్దే ఉంటోంది. 13న వైశాలి ఇంటి నుంచి వెళ్ళినట్లు తెలిపా రు. భర్త పిర్యాదుపై కేసును నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

కడప(క్రైం)నవంబరు14(ఆంధ్రజ్యోతి): కడప నగరం మరియాపురం మహిళను బెదిరించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అయన వివరాల మేరకు రాజరెడ్డి వీధికి చెందిన సుజీత్ అలియాస్ బన్ని డబ్బు విషయమై మహిళను గురువారం బెదిరించారని బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గండి గురుకుల పాఠశాలలో రాష్ట్ర క్రీడలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న కర్నూలు గురుకుల పాఠశాలల సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి

చక్రాయపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గండి గురుకుల పాఠశాలలో గురువారం రాష్ట్రస్థాయి జోన్-4 క్రీడలు ప్రారంభమయ్యాయి. కర్నూలు గురుకుల పాఠశాలల సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి కాగడాను వెలిగించి క్రీడలను ప్రారంభించారు. రాష్ట్రంలో దాదాపు 21 గురుకుల పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు రోజులు క్రీడలు జరగనున్నాయి. కార్యక్రమంలో చిత్తూరు గురుకుల పాఠశాల సమన్వయకర్త పద్మజ, జూనియర్ కళాశాల ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్య, మాజీ స్పోర్ట్స్ అథారిటీ రామచంద్రారెడ్డి, జోన్-4 క్రీడలు సమన్వయకర్త నీలకంఠేశ్వరరావు, ఆర్గనైజర్ కె.ఎల్లారెడ్డి, ఎంపీటీసీ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సహకార పరపతి సంఘాలను బలోపేతం చేయాలి

కడప రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార పరపతి సంఘాలను మరింతగా బలోపేతం చేయాలని డీసీసీ బ్యాంకు ఇన్‌చార్జ్ సీఈఓ రాజామణి పేర్కొన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ కంప్యూటరైజేషన్ ద్వారా వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పటిష్టం చేయాలన్నారు. బ్యాంకు సేవలను మరింత సులభతరం చేస్తున్నామని, అన్ని వర్గాల వారికి విరివిగా రుణాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సుభాషిణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన జయంత్యుత్సవాలు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి మహోత్సవాలు నవంబరు 12 ప్రారంభమై 14న మహా ప్రసాద వినియోగంతో వైభవంగా ముగిసినట్లు ఆలయ ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. గురువారం ఉదయం సుప్రభాతం, పారాయణం, వీరబ్రహ్మేంద్రస్వామికి విశేష హోమాలు, మండల పూజ, శాంతి హోమం. పూర్ణాహుతి చేపట్టారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

కార్తీక సహస్ర దీపార్చన

బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణలో సాయంత్రం 6గంటలకు భక్తిశ్రద్ధలతో పూర్వపు మఠాధిపతి కుటుంబసభ్యులు, భక్తులు కార్తీక సహస్ర దీపార్చన చేశారు. కార్యక్రమంలో ఉభయదాతలు ఇడమకంటి జనార్ధన శివాచార్య కుటుంబ సభ్యులు పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు, ఫిట్‌పర్సన్ శంకర్ బాలాజీ మేనేజరు ఈశ్వరాచారి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన చెరుకూరి రవికుమార్



సీఎంతో కలిసిన టీడీపీ నేత రవికుమార్

పోరుమామిళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును బద్వేలు టీడీపీ యువనేత చెరుకూరి రవికుమార్ కలిశారు. గురువారం సచివాలయంలోని ఛాంబరులో కలిసి పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తాను చేసిన సేవలు గుర్తించమని ముఖ్యమంత్రికి తెలిపి తనకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందిం చినట్లు తెలిసింది.

'హైందవ శంఖారావం' విజయవంతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి

సింహాద్రిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) విశ్వహిందూ పరిషత్-ఏపీ ఆధ్వర్యంలో 2025 జనవరి 5న విజయవాడలో జరిగే బహిరంగ సభకు హిందూ బంధువులు లక్షలాదిమంది సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, ఆరెస్సెస్ విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్‌జీ పిలుపునిచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయంలో హైందవ శంఖారావం సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలని వీహెచ్‌పీ ఒక జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. చట్టసవరణ చేయాలని కోరుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల గవర్నర్లకు సెప్టెంబరు 30న మెమొరాండం ఇచ్చామన్నారు.

● కార్తీక పౌర్ణమికి సర్వం సిద్ధం


దేవుని కడప శివాలయం


నబీకోట శివాలయం


మోచంపేట శివాలయం


మృత్యుంజయకుంట శివాలయం

నేడు కార్తీక పౌర్ణమి కావడంతో కడప నగరంలోని శివాలయాలు పూజలకు సిద్ధమయ్యాయి. ప్రధానంగా దేవుని కడప వెంకటేశ్వరస్వామి ఆలయంలో గల శివాలయం, అలాగే మోచంపేట, నబీకోట, మృత్యుంజయకుంట, శంకరాపురం, ఎర్రముక్కపల్లె తదితర ఆలయాలను అలంకరించారు. ఆయా ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించనున్నారు. - జిల్లా ఫొటోగ్రాఫర్, కడప

గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యులవుదాం: ఎంపీడీఓ

పులివెందుల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుదామని ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, ఏపీఎం గురురాజ్, ఎంఈఓ-2 రామానాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ శ్రీరమాదేవి, ఈఓపీఆర్డీ శారదమ్మ, ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ విశ్వనాథరెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ మాబున్ని, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

చెన్నూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు అన్నారు. 2025-26 సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీలు అభివృద్ధిపథంలో నడిపించేందుకు తయారు చేసిన ప్రణాళికపై అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

పక్కా ప్రణాళిక ద్వారా గ్రామాల అభివృద్ధి

సీకేదిన్నె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పక్కా ప్రణాళిక ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీఓ కుళాయిబాబు తెలిపారు. గురువారం చింతకొమ్మదిన్నెలో అభివృద్ధి ప్రణాళికపై వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈఓఆర్‌డీ టీ.వి.సుబ్బారెడ్డి, పంచాయతీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

18 ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు : డీఎంహెచ్‌ఓ

కడపకలెక్టరేట్ నవంబరు14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 ఏళ్లు పైబడిన వారంతా బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, రొమ్ము, నోరు, గర్భాశయ ముఖద్వార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. గురువారం రాధాకృష్ణ నగర్, కో-ఆపరేటివ్ నగర్‌లో ఇంటింటా ఎన్‌సీడీ 3-0 సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రక్త పోటు, రక్తహీనత, చెక్కర జబ్బుల దుష్పరిణామాల వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. స్ర్కీనింగ్‌తో క్యాన్సర్‌ను గుర్తించి, రక్షించుకునే వీలుందన్నారు. పొగాకు, గుట్కా, సిగరెట్లు, ఆల్కహాలు, జంక్ ఫుడ్ ఆహారపు అలవాట్లతో వచ్చే జబ్బులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈపరీక్షలకు పరికరాలను ఇప్పటికే ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ(సీహెచ్‌ఓ)లకు అందజేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ సముద్ర, ఎంఓ ఖాజా, మొహీద్దీన్, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకరణలో గౌరీదేవి


సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు

వేంపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సంగం వీధిలోని గౌరీదేవి ఆలయంలో కార్తీక మహోత్సవ వేడుకల్లో భాగంగా అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. నెల్లూరుకు చెందిన సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పెద్దఎత్తున భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

సీకేదిన్నె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో గురువారం అసంక్రమిత వ్యాధులు అరికట్టడంలో భాగంగా చేపట్టిన సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్‌లాంటి వ్యాధులు పెరుగుతున్నాయని,వాటిని వెంటనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా నివారణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడమాలజిస్ట్ ఖాజా, డాక్టర్ రాఘవేంద్ర, సునీత, సీహెచ్‌వో సుకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రామాపురంలో కోటి దీపోత్సవం

కమలాపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రామాపురం క్షేత్రంలో వెలసిన మోక్ష నారాయణస్వామి, శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఈ నెల 16న కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కాశీభట్ల సత్యసాయినాథశర్మ తెలిపారు. ఆలయ మాఢవీధుల్లో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఊరేగింపు ఉంటుందన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం

కడప (సెవెన్‌రోడ్స్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో గురువారం సాయంత్రం రాజీవ్ పార్కు వద్ద ఎల్‌ఐసీ ఉద్యోగుల కళాజాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ కళాజాతా సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య, జోనల్ ఉపాధ్యక్షురాలు సుజాత మాట్లాడారు. దేశం ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, వ్యవసాయం, పరిశ్రమలు, స్టీలు, రైల్వేలు, ఆయిల్ రంగాల్లో స్వంత కాళ్లపై నిలబడడానికి ప్రభుత్వ రంగ సంస్థలే కారణమని, వాటిని బలహీనపరచడం దేశానికి మంచిది కాదన్నారు. కళాజాతలో భాగంగా ఎల్ఐసీ యూనియన్ కళాకారులు నాటికలు ప్రదర్శించారు. నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదు యూనియన్ నేతలు పాల్గొన్నారు.

ఇక స్థానిక సంస్థలు బలోపేతం: టీడీపీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడంపై ఉన్న ఇద్దరు బిడ్డల నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం సడలించడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం ఆమోదం పొంది అమల్లోకి రావడంతో స్థానిక సంస్థలు బలోపేతం చెందుతాయని స్పష్టం చేశారు. గురువారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయనతో పాటు టీడీపీ నేత జి.ప్రసాద్, బాలక్రిష్ణ విలేకరులతో గత నిబంధనల వల్ల అనేక మంది సామర్థ్యం, అవగాహన ఉన్న మేధావులు సైతం ఎన్నికలకు దూరమవుతూ వచ్చారన్నారు. ఈ నిబంధనను మార్చడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు







నాగార్జున హైస్కూలులో నెహ్రూకు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం క్రిష్ణారెడ్డి...సాయిబాబా స్కూలులో మాట్లాడుతున్న కార్పొరేటరు శ్రీదేవి...గురుకుల్ విద్యాపీఠ్‌లో నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్లు

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): నేటిబాలలే రేపటి పౌరులని, వారిని దేశ ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ అంధుల బాలుర పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్జి మాట్లాడుతూ భారతదేశ మొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని నవంబరు 14న బాలల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రతి విద్యార్థీ చక్కగా చదువుకొని లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. బాలల సంరక్షణకు న్యాయసేవాధికార సంస్థ స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2015 గురించి వివరించారు. అనంతరం జడ్జి హియరింగ్ మిషన్లను పంపిణీచేసి వైద్యాధికారులచేత ఆడియో మెట్రిషన్ టెస్టులు నిర్వహింపజేశారు.

పులివెందులలో...

నెహ్రూ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జేఎన్టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శేషమహేశ్వరమ్మ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్.తుమ్మలపల్లె అంగన్వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎ.సాంబయ్య, పాల్గొన్నారు.

వేంపల్లెలో...

కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నెహ్రూ చిత్రాపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చైతన్య హైస్కూల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. చిన్నారులు ప్రదర్శనతో అందరిని అలరించారు.

నాగార్జున హైస్కూలులో...

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):కడప నగరం నాగార్జున ఇంగ్లీషు మీడియం హైస్కూలులో కరస్పాండెంట్ కె.శివతులసమ్మ అధ్యక్షతన బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నెహ్రూ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణారెడ్డి, డైరెక్టరు శివప్రసాద్‌రెడ్డి, హెడ్‌మిస్ సుశీల పాల్గొన్నారు.

సాయిబాబా పాఠశాలలో...

కడప నగరం అక్కాయపల్లె సాయిబాబా పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటరు ఎంవీ శ్రీదేవి, సాయిబాబా విద్యాంసంస్థల వైస్ చైర్మన్ సాయిసుధీర్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురుకుల్ విద్యాపీఠ్‌లో...

కడప నగరం గురుకుల్ విద్యాపీఠ్ హైస్కూలులో బాలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాలల అధినేత వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి పిల్లలు రేపటి పౌరులు కాబట్టి దేశ శ్రేయస్సు కోసం పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టరు ఎ.వీరకుమారి, సీఈవో వివేకానంద, ప్రిన్సిపల్ మునిచంద్ర, వైస్‌ప్రిన్సిపాల్ నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వికాస్ హైస్కూలులో...

కడప నగరం అక్కాయపల్లెలోని వికాస్ హైస్కూలులో బాలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ హరిక్రిష్ణ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ తొలి ప్రధాని నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతల్లో ఉందన్నారు. హెచ్‌ఎం హమీద్ పాల్గొన్నారు.

పవన్ స్కూలులో...

కడప నగరం అక్కాయపల్లెలోని పవన్ హైస్కూలులో చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించా రు. కరస్పాండెంట్ జోగిరామిరెడ్డి నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తొలి ప్రధాని నెహ్రూకు పిల్లలంటే అమితమైన ప్రేమ కలిగి ఉండడమే ఈ వేడుకలకు ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు.







కడప: వికాస్ హైస్కూలులో నివాళులర్పిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ హరిక్రిష్ణ... పవన్ స్కూల్‌లో కరస్పాండెంట్ లెక్కల జోగి రామిరెడ్డి... వేంపల్లె చైతన్య హైస్కూల్లో నివాళి

రాయలసీమ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

లింగాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఐదురోజుల పాటు జరగనున్న రాయలసీమ స్థాయి జోన్-4 క్రీడా పోటీలు గురువారం ఇప్పట్ల గురుకుల పాఠశాలలో ప్రారంభమయ్యాయి. రాయలసీమ వ్యాప్తంగా ఉన్న 38 గురుకుల కళాశాలల నుంచి 700 మంది బాలికలు క్రీడా పోటీలకు హాజరయ్యారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, క్యారమ్స్, త్రోబాల్, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలు నిర్వహిస్తారు. జోనల్ పోటీల్లో కడప జిల్లా ఇన్‌చార్జ్ ఉదయశ్రీ, లింగాల ఎంపీపీ రమాదేవి, ఇప్పట్ల సర్పంచు అంకాళమ్మ, పులివెందుల రూరల్ సీఐ ఎన్‌వీ రమణ, ఎస్ఐ మధుసూధన్‌రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సత్యవతమ్మ, ఎంఈఓ రామకృష్ణయ్య, తులశమ్మ ప్రారంభ వేడుకలలో పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేయించుకోవాలి

వేంపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం నమోదు చేయించుకోవాలని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర అన్నారు. గురువారం వివేకానందరెడ్డి నగర్, గాజులపేటలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆదేశానుసారం సభ్యత్వ నమోదు నిర్వహించామని, 500 మందిని సభ్యులుగా చేర్చామన్నారు. ప్రమాద బీమా ఉందని, సభ్యులుగా చేరాలని కోరారు. కోనేటి నారాయణ, పవన్, సురేష్, మణి పాల్గొన్నారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో లాంగ్వేజి పండిట్‌ల సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగర పాలక పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ ఎస్‌జీటీ, లాంగ్వేజీ పండిట్‌ల సీనియారిటీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ మీనాక్షి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏదైనా అభ్యంతరాలుంటే శుక్రవారం ఉదయం 10.30 నుంచి డీఈఓ కార్యాలయంలో వ్యక్తిగతంగా హాజరై లిఖితపూర్వకంగా తెలపాలని కోరారు. అలాగే ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలతో సర్వీసు బుక్‌తో పాటు చెక్ చేయించుకోవాలని సూచించారు.

అంజన్నకు స్నపన తిరుమంజనం

చక్రాయపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరుగుతున్న పవిత్రోత్సవాలలో భాగంగా గురువారం అంజన్నకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉదయం త్రికాల ఆరాధన, మన్యసూక్తహోమం, పంచముఖ హనుమాన్ మూలమంత్ర హోమం, పవిత్ర సమర్పణ, స్నపన తిరుమంజనం, లఘు పూర్ణాహుతి, నివేదిన, శాత్తుమురై గోష్ఠి, సాయంత్రం త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, సింధూర అర్చన చేపట్టారు. పండితులు రామ్మోహన్‌శర్మ, మాజీచైర్మన్ వెంకటస్వామి, తిరుపత వేదపాఠశాల పండితులు పాల్గొన్నారు.


హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

పెద్ద దర్గా ఉరుసుకు ప్రత్యేక బస్సులు

కడప మారుతీనగర్, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఆర్టీసీ కడప డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కడప రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు, పాత బస్టాండు, మాచుపల్లె బస్టాండ్ మీదుగా పెద్ద దర్గా వరకు ఈ బస్సులు నడుస్తాయన్నారు. రైళ్లు వచ్చే సమయానికి భక్తులకు అనుకూలంగా రైల్వేస్టేషన్ నుంచి, మిగతా సమయాలలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులు వస్తాయన్నారు. అలాగే రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులు ఏర్పాటు చేసేందుకు సైతం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇందులో బస్సు చార్జీ కింద రూ.20 వసూలు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

పాలస్తీనా సంఘీభావ సభను జయప్రదం చేయండి

కడప మారుతీనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనా సంఘీభావ సభను జయప్రదం చేయాలని కడప సిటిజన్స్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ రాజా వెంగల్‌రెడ్డి, బాబూ బాయ్ పిలుపునిచ్చారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని తక్షణమే ఆపాలని కోరుతూ ఈనెల 16 సాయంత్రం 4 గంటలకు జిల్లా పరిషత్ హాలులో తలపెట్టిన సంఘీభావ సభను జయప్రదం చేసేందుకు మానవతావాదులు, సామాజిక వేత్తలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, శాంతికాముకులు తప్పక హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పీపీ నాయకుడు రవిశంకర్‌రెడ్డి, సాహితీ స్రవంతి నాయకుడు పిళ్లా విజయకుమారస్వామిరెడ్డి, మక్బుల్‌బాష, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్య కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్‌డే



ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో నృత్యాలతో అలరిస్తున్న వైద్యవిద్యార్థులు

కడప (సెవెన్‌రోడ్స్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కడప నగర పరిధిలోని పుట్లంపల్లె వద్ద గల ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ వైద్యవిద్యను అభ్యసించేందుకు వచ్చిన విద్యార్థులు శ్రద్ధగా విద్యనభ్యసించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ వెంకటలక్ష్మి, అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ సునీల్, డాక్టర్ బాలిరెడ్డి, డాక్టర్ స్వరూపరాణి, వైద్యులు పాల్గొన్నారు.

నేడు జ్వాలా తోరణం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెన్నా తీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం జ్వాలాతోరణం ఉంటుందని ఆలయ చైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

కలసపాడులో అక్రమ లేఅవుట్లు

పట్టించుకోని అధికారులు





అక్రమ లేవుట్‌లో నిర్మించిన కొత్తకోట సొసైటీ భవనం, కలసపాడులో ఉన్న అక్రమ లేవుట్

కలసపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కలసపాడు మండలంలో అక్రమ లేఅవుట్లు ఇష్టానుసారంగా వేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కరోనా సమయంలో కలసపాడు రెవెన్యూ మహానందిపల్లె రెవెన్యూలో ఇష్టానుసారంగా లేవుట్లు వేసి ప్లాట్లను ప్రజలకు అంటకట్టేశారు. ముఖ్యంగా కలసపాడు రెవెన్యూలో 1, మహానందిపల్లె రెవెన్యూలో 3 లేఅవుట్ల ఎటువంటి అనుమతులు లేకుండా నే వేశారు. లేఅవుట్ వేయాలంటే వ్యవసాయ భూమి నుంచి ఇళ్ల స్థలాలకు ఉపయోగ పడేలా ల్యాండ్ కన్వర్షన్ చేయాలి. అనంతరం 30 అడుగుల రోడ్డు వేసి డ్రైనేజీ, విద్యుత్ లైన్లు నిర్మించాలి, అలాగే పంచాయతీకి లేఅవుట్ స్థలంలో 5 శాతం పంచాయతీకి భవిష్యత్ అవసరాల కోసం ఇవ్వాలి. అలాగే అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంటు నుంచి ప్రత్యేక అనుమతులు ఉండాలి. తాగునీటికి సంబంధిం చిన పైపు లైన్లు నిర్మాణం చేపట్టాలి. అనంతరం రిజిస్ట్రేషన్ జరుగుతాయి. ఒకే సర్వేనెంబరులో 2 లేదా 3 సెంట్లు వంతున రిజిస్టరు అవుతుందనుకుంటే రిజిస్టర్లుదేనికోసం అవుతుందో తెలుసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. కానీ రిజిస్ట్రేషన్లు అయితే జరిగిపోయాయి. అనంతరం అక్కడ నిర్మాణాలు కూడా చేపట్టారు. అనుమతులు ఏ విధంగా వచ్చాయో అర్థం కావడంలేదని ప్రజలు తెలుపుతున్నారు.

లేఅవుట్‌లో ప్రభుత్వ భవనం...: కలసపాడు రెవెన్యూ పొలంలో పుల్లారెడ్డిపల్లె వెళ్లే దారిలో రెండున్నర ఎకరాల స్థలంలో లేఅవుట్ అంకాలమ్మ హౌసింగ్ సొసైటీగా బోర్డు పెట్టి చుట్టూ ప్రహరీ నిర్మించి విద్యుత్ స్తంభాలు పాతి లేఅవుట్ నిర్మించారు. దీంట్లో కొత్తకోట సొసైటీ భవనం 25లక్షల రూపాయల నిధులతో నిర్మించారు. దీనికి కారణం వైసీసీ నాయకులు తమ లేఅవుట్‌లో ప్లాట్లను అమ్ము కున్నారనే విమర్శలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలు తుంగలో తొక్కి రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం భవన నిర్మాణం జరిగిపోయి కార్యాలయం కూడా ప్రారంభమైంది. ఈ విషయమై కొత్తకోట సొసైటీ అధికారి నారాయణరెడ్డిని వివరణ కోరగా రిజిస్ట్రేషన్ అయింది అని తెలిపారు. ల్యాండ్ కన్వర్షన్ లేకుండా ఏ విధంగా ప్రభుత్వ భవనం నిర్మిస్తారని, రిజిస్ట్రేషన్, అనుమతులు ఏ విధంగా ఇచ్చారు అని అడగ్గా సమాధానం దాటవేశారు. అలాగే ఈ విషయమై తహసీల్దారు మధురవాణిని వివరణ కోరగా మండలంలో కేవలం రెండు మాత్రమే ల్యాండ్ కన్వర్షన్లు జరిగాయన్నారు. లేఅవుట్లకు ఎక్కడా ల్యాండ్ కన్వర్షన్ జరగలేదని తెలిపారు. లేఅవుట్లపై పరిశీలించి తగిన తీసుకుంటామన్నారు.

పేద ప్రజల ఆకలి తీర్చడానికే అన్నదానం

● లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం

● సహకరిస్తున్న దాతలు



పేదలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలు అందించడంలో పేరుపొందిన సంస్థ లయన్స్‌క్లబ్. మహిళలకు కుట్టు శిక్షణ, వృద్ధులకు కంటి చికిత్సలు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటుంది. ప్రొద్దుటూరు లయన్స్‌క్లబ్ నిర్వాహకులు పేద ప్రజల ఆకలి తీర్చడానికి అన్నదానం చేపట్టారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద 2021 వినాయక చవితి రోజు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ప్రతిరోజు సుమారు 200 మందికి అన్నదానం చేస్తారు. పేద ప్రజలు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల వెంబడి వచ్చే సహాయకులతోపాటు ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరుకు వెళ్లేవారు అన్నదానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. దాతలు తమ వంతు సహకరిస్తున్నారు. మామూలు రోజుల్లో రూ.3,500, పండుగ రోజులు, సెలవు రోజుల్లో రూ.5 వేలు దాతల నుంచి తీసుకుంటున్నారు. విదేశాల నుంచి కూడా దాతలు అన్నదానానికి విరాళాలు ఇస్తున్నారు. విరాళాలు రాని రోజున లయన్స్‌క్లబ్ సభ్యులే ఖర్చు భరిస్తున్నారు.

● **ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడమే లక్ష్యం..:** ఆకలితో ఉన్నవారికి అన్నప్రసాదం అందించడమే లయన్స్‌క్లబ్ లక్ష్యమని క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్టు గవర్నర్ జొన్నలగడ్డ రామచంద్రప్రకాశ్‌రావు తెలిపారు. 2021 నుంచి నిరాటంకంగా అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నామన్నారు. అన్నదాన కార్యక్రమానికి దాతలు, లయన్స్‌క్లబ్ సభ్యుల సహకారం మరువలేనిదన్నారు.

తిరుపాల్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం

దువ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి సేవలు ప్రశంసనీయమని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో తవ్వా వెంకటయ్య రచించిన దువ్వూరి సీమలో ఇరగంరెడ్డి అనే పుస్తకాన్ని మాజీ ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, తవ్వా వెంకటయ్య, విజయగోపాల్‌రెడ్డి, వీరారెడ్డి, సత్యనారాయణరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ప్రణీత్‌కుమార్‌రెడ్డి, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నతస్థానాన్ని అధిరోహించాలి : ఆర్డీవో

జమ్మలమడుగు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చక్కగా చదువుకుని ఉన్నతస్థానాన్ని అధిరోహించాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ సూచించారు. గురువారం జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 250 బాలికలకు దుప్పట్లు, శానిటరీ కిట్లనుపంపిణీ చేశారు. ఇటీవల జరిగిన పలు రకాల పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనపరిచిన వారికి ఆర్డీవో సాయిశ్రీ, కూటమి నాయకుడు పురుషోత్తంరెడ్డి, సీఐ లింగప్ప బహుమతులు అందజేశారు. హ్యూమన్‌రైట్స్ నియోజకవర్గపు అధ్యక్షురాలు అన్నపురెడ్డి రాణి, కస్తూరిబాగాంధీ విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి బోయ కార్పొరేషన్ స్టేట్‌డైరెక్టర్‌గా నల్లబోతుల నాగరాజు

ప్రొద్దుటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజును వాల్మీకి బోయ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా నియమించారు. ఆమేరకు రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ల జాబితాలో జిల్లా లో ప్రొద్దుటూరు నుంచి ఆయనను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. నాగరాజు ప్రొద్దుటూరు టీడీపీలో క్రియాశీలకంగా పనిచేశారు. పార్టీ తన కష్టాన్ని గుర్తించి వాల్మీకిబోయ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిందన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

17న వరలక్ష్మి హాస్పిటల్లో సంతాన సాఫల్య ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణం గీతా ఆశ్రమం వీధిలోని వరలక్ష్మి హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వైద్య నిపుణురాలు శిల్ప, డాక్టర్ కిశోర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వివాహిత జంటలకు సంతానం కలగడం ఒక ప్రధాన సమస్యగా మారిందని పేర్కొన్నారు. అవసరమైన దంపతులు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతస్థానంలో నిలవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి సూచించారు. గురువారం జమ్మలమడుగులోని మహాత్మాజ్యోతిరావుపూలే పాఠశాలను జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ముందుగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని వంటశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల్‌ను సత్కరించిన నాయీబ్రాహ్మణులు



వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణసేవాసంఘం సభ్యులు

బద్వేలుటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన కొలవలి వేణుగోపాల్‌ను బద్వేలు పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొలవలి వేణుగోపాల్ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణసేవా సంఘం సభ్యులు వడ్డమాను గురుబ్రహ్మం, కోడూరు లక్ష్మీనారాయణ, ప్రసాద్, వెంకటసుబ్బయ్య, మహేష్, శివ, విజయకుమార్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుల గుర్తింపునకు సమగ్ర సర్వే

బద్వేలు ,నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యూపీఎస్సీ గాంధీనగర్ పరిధిలోని శ్రీకృష్ణ దేవరాయనగర్ సచివాలయ పరిధిలో క్యాన్సర్ బాధితులను గుర్తించేందుకు సమగ్ర సర్వే చేపట్టినట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్ పేర్కొన్నారు. సర్వేలో భాగంగా గురువారం పట్టణ పరిధిలో నిర్వహించిన సర్వేలో 18 సంవత్సరాలు నిండిన వారికి నోటి, రొమ్ము,గర్భాశయ క్యాన్సర్లతో పాటు బీపీ, షుగర్‌కు పరీక్షలు నిర్వహించారు. అనంతరం అనుమానిత కేసులను గుర్తించారు. ఈ కార్యకమంలో సూపర్‌వైజరు, ఆరోగ్యకార్యకర్తలు, తదితరులు పాలొన్నారు.

అట్లూరు..: మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా వ్యాధి నిరోధక శాఖ అధికారి ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. గురువారం అట్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్‌పై సిబ్బందితో అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీనిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అమితాబేగం, సీహెచ్‌వో మురళీక్రిష్ణ, సిబ్బంది మాధురి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ఎన్‌డీసీ 3.0పై ఇంటింటి సర్వే చేపట్టినట్లు జిల్లా ప్రోగ్రామ్ అధికారి శశిభూషణ్ తెలిపారు. గురువారం స్థానిక 1 వవార్డు బొల్లవరంలో ఎన్‌డీసీ 3.0 ఇంటింటి సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు పైబడిన వారందరికి రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌కు వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్‌నారాయణ, డాక్టర్ అలీం దౌలా, డాక్టర్ నజీర్ బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే నేతాజీ నగర్ మోడంపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి హిమబిందు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ జయమ్మ, సీహెచ్‌ఓసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కుల గణాంకాల సేకరణ చేపట్టాలి

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్యమాదిగ

ముద్దనూరు నవంబరు14 (ఆంధ్రజ్యోతి):ఎస్సీ కుల గణాంకాల సేకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్యమాదిగ డిమాండ్ చేశారు.ముద్దనూరులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ చేసే అధికారం ఆయా రాష్ట్రాల పరిధిలో ఉందన్నారు.షెడ్యూల్ కులాల వర్గీకరణ అడ్డంకులు లేకుండా రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు, డప్పు చర్మకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, మంత్రాల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు డీఎస్పీగా వెంకటేశ్వరరావు



జమ్మలమడుగు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డీఎస్పీగా గురువారం వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ప్రకాశం జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా విధులు నిర్వహించారు. బదిలీపై జమ్మలమడుగు డీఎస్పీగా వచ్చారు. మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వసతి గృహ ప్రహరీ కూల్చివేత పరిశీలన



ప్రహరీ కూల్చివేతను పరిశీలిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతమ్మ

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నడింపల్లెలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం ప్రహరీ కూల్చివేతను గురువారం ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీ రాఘవరెడ్డితో ఫోన్‌లో చర్చించారు. వసతి గృహంలో ఎటువంటి నిర్మాణాలుచేపట్టబోమని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీడీ సరస్వతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రహరీ కూల్చివేతపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తామన్నారు. ప్రహరీ తొలగింపుపై నడింపల్లె మున్సిపల్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడికి నోటీసులు ఇవ్వాలని వసతి గృహ అధికారులను ఆదేశించారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరుకు ఘన సన్మానం



ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పరిటాల వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న నాయకులు

బి.కోడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరుగా బి.కోడూరు మండలం తుమ్మలపల్లె గ్రామానికి చెందిన పరిటాల వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. ఆయనను గురువారం బద్వేలు నియోజక వర్గ యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి, గోడి ప్రతాప్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రామ్మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పవన్, బాలిరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

నిస్వార్థంగా ఎన్నికలు నిర్వహించాలి

ఆర్డీవో చంద్రమోహన్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

బద్వేలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలను అధికారులు నిస్వార్థంగా నిర్వహించాలని ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సాగునీటి ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బద్వేలు నియోజకవర్గంలో 51 నీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆర్డీవో బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎన్నికల అధికారులు, స్థానిక అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికలలో అనుసరించాల్సిన విధివిధానాలు ఆయన సూచించారు. ఏకాభిప్రాయం ద్వారా ఎన్నుకున్నట్లయితే ప్రభుత్వం ప్రకటించే ప్రోత్సాహక బహుమతులను అందిస్తామన్నారు. అధికారులు ప్రశాంత ఎన్నికలకు సహకరించాలన్నారు.

చెరువును తలపిస్తున్న జాతీయ రహదారి

ఇబ్బందుల్లో వాహనచోదకులు, పాదచారులు

బద్వేలుటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మైదుకూరురోడ్డు జాతీయ ప్రధాన రహదారి గురువారం కురిసిన చిన్నపాటి వర్షానికే జలమయమై చెరువును తలపిస్తోంది. వర్షపునీటికితోడు మురుగునీరు పారడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు పంచాయతీలుగా ఉన్న బద్వేలు పట్టణం మున్సిపాలిటీగా పురోగతి చెంది 15 ఏళ్లు దాటి మూడో పాలకవర్గం నడుస్తున్నప్పటికీ జాతీయ రహదారిలో డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా మారాయి.ప్రధాన రహదారిలోని డ్రైనేజీ కాలువల్లో పూడికతీసేందుకు ఇటీవల సుమారు 50లక్షల రూపాయలు ఖర్చుచేసినా ఫలితం శూన్యమని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ప్రధాన రహదారిలో మురుగునీరు, వర్షపునీరు పారుతూ మునిసిపాలిటీ కాస్త మురికిపాలిటీగా మారిందన్న ఆరోపణలు సర్వత్రా విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారులు, వార్డుల్లో మురుగుకాలువలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి